www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 19 జులై 2025
5
అన్నమయ్య



పిఎంజెఎవైపై అవగాహన కల్పించండి


పిహెచ్‌సిలో రికార్డులు పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ లక్ష్మీనరసయ్య

ప్రజాశక్తి-మదనపల్లె

ప్రధానమంత్రి జన ఆరోగ్యయోజన, వయోవందన బీమా కార్డులపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించి ఇకెవైసి చేయాలని అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ లక్ష్మి నరసయ్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం సిటిఎం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్బగా పిహెచ్‌సి దస్త్రాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రోగులతో సఖ్యతగా మెలగాలని, పిహెచ్‌సిల్లో ప్రసవాలు జరిగేలా సిబ్బంది కృషి చేయాలన్నారు. సీసనల్ వ్యాధుల పట్ల గ్రామాలో అవగాహన సమావేశాలు నిర్వహించి ప్రజలను చైతన్య పరచాలన్నారు. మందుల స్టోర్‌ను పరిశీలించి అన్ని మందులు స్టాక్ ఉండేలా చూసుకుంటూ ఇండెంట్ అవసరమైన మందులకు రైజ్ చేయాలన్నారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ జాన్సీ, సిబ్బంది పాల్గొన్నారు.

తొలగని 'మహా' సంకటం

- మహానాడు ఖర్చు జిల్లా అధికారుల మెడకు!
- ప్రతి డిపార్టుమెంట్‌కు రూ.లక్షల్లో వ్యయం
- వ్యయ సేకరణకు మంత్రుల మోకాలడ్డు
- అమాత్యుల పేషీల నుంచి ఫోన్లు

జిల్లాలో టిడిపి మహానాడు వేడి సెగలు తగ్గడం లేదు. జిల్లాలోని పలు మెడికల్ సంస్థల నుంచి జిల్లా స్థాయి ఉన్నతాధికారుల వరకు తప్పని పరిస్థితి కనిపిస్తోంది. ఈ ఏడాది మే నెల 27, 28, 29వ తేదీల్లో కడపలో టిడిపి మహానాడును నిర్వహించిన సంగతి తెలిసిందే. మహానాడును జయప్రదం చేయడానికి రాష్ట్రానికి చెందిన పలువురు మంత్రులు వారం రోజుల పాటు జిల్లాలో మకాం వేశారు. వసతి, బోజన, ఇతర ఏర్పాట్ల ఖర్చులను ఆయా డిపార్టుమెంట్లకు చెందిన జిల్లా అధికారుల మెడకు చుట్టినట్లు తెలుస్తోంది. మహానాడు ముగిసిన అనంతరం మంత్రులు ఖర్చులను చెల్లించని నేపథ్యం చర్చనీయాంశంగా మారింది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో టిడిపి మహానాడు కార్యక్రమ వేడి చల్లారలేదు. రాష్ట్రంలోని సుమారు 32 మందికిపైగా మంత్రులు, అనుచరులు, పిఎలు పెద్ద ఎత్తున జిల్లాకు చేరుకున్న సంగతి తెలిసిందే. జిల్లాలోని ఆయా డిపార్టుమెంట్లకు చెందిన జిల్లా ఉన్నతాధికారులు పార్టీ కార్యక్రమం అయినప్పటికీ సంబంధిత శాఖల మంత్రుల, అనుచరుల, పిఎల ఖర్చులను సొంతంగానే భరించారు. ప్రతి ఉన్నతాధికారి డిపార్టుమెంట్ తరపున వసతి, భోజన, ఇతర సదుపాయాల కల్పనకు సుమారు రూ.రెండు లక్షల నుంచి రూ.ఐదు లక్షల వరకు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది.

రూ.90 లక్షలు భరించేదెలా!

జిల్లాలోని 32పైగా డిపార్టుమెంట్ల ఉన్నతాధికారులు సగటున రూ.రెండు లక్షల నుంచి రూ.ఐదు లక్షల వరకు ఖర్చు చేశారు. ఈలెక్కన సగటున రూ.90 లక్షల నుంచి రూ.కోటి వరకు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. మహానాడుముగిసిన అనంతరం రూ.రెండు లక్షలకుపైగా ఖర్చు చేసిన అధికారులు కొన్ని కాంట్రాక్టు పనులకు ఆమోదం పొందడం ద్వారా పెట్టుబడిని భర్తీ చేసుకున్నారు. భర్తీకి అవకాశం లేని కొన్ని శాఖల అధికారులు తమ పరిధిలోని డివిజనల్, మండల స్థాయి అధికారులను కొంత షేర్ చేసుకోవాలని కోరడంతో ఆలస్యంగా వెలుగులోకి రావడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఇంతటి పరిమాణంతో కూడిన ఖర్చులను జిల్లా ఉన్నతాధికారులే భరించడం సాధ్యం కాదని, తమ జీతాన్ని పూర్తిగా ఖర్చు చేయాల్సి వస్తోందని, మిగిలిన అధికారులు సైతం పంచుకోవడం ద్వారా తేలిక అవుతుందని చెబుతున్నట్లు సమాచారం.

వసూళ్లపై పిఎల గరంగరం

మహానాడు ఖర్చులను షేర్ చేసుకోవాలనడంపై డివిజనల్ అధికారుల్లో వ్యతిరేకతకు దారితీయడం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలోని ఆయా మంత్రులకు డివిజన్ అధికారులు షేర్ చేసుకోవాలనే సమాచారం చేరినట్లు సమాచారం. ఆయా మంత్రుల పిఎల కింది స్థాయి అధికారుల నుంచి డబ్బులు వసూలు చేయరాదని ఫోన్లు చేస్తుండడంపై ఉన్నతాధికారులు విస్తుపోతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు మంత్రులు, పిఎలనుద్దేశించి మీ ఖర్చులు మీరు భరించకుండా, ఉన్నతాధికారుల నెత్తిన రుద్ది, పెట్టిన ఖర్చులను మిగిలిన అధికారులకు షేర్ చేయొద్దంటే ఎలా, తాము ఎక్కడి నుంచి పెట్టిన డబ్బుల్ని తీసుకురావాలని నసుగుతున్న నేపథ్యం కనిపిస్తోంది.

శతశాతం అక్షరాస్యత సాధనకు కృషి చేద్దాం

- కలెక్టర్ చామకూరి శ్రీధర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

అక్షరాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లాలో శతశాతం అక్షరాస్యతను సాధించేందుకు కృషి చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం తన చాంబర్‌లో అక్షరాంధ్ర, ఉల్లాస్ కార్యక్రమాలపై జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. వయోజన విద్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ సుబ్బారెడ్డి, అక్షరాంధ్ర, ఉల్లాస్ కార్యక్రమాలపై వివిధ అంశాలను కలెక్టర్‌కు వివరించారు. సమాజంలోని వివిధ వృత్తుల్లో ఉన్న 15 ఏళ్ల పైబడిన వయోజనులను దృష్టిలో పెట్టుకొని తీసుకువచ్చిన కార్యక్రమన్నారు. ఎస్‌హెచ్‌జి లబ్ధిదారులు, ఆయాలు, వంట వండేవారు, వివిధ రకాల సహాయకులు, వివిధ కార్యాలయాల కాపలదారులు, తదితరులను అక్షరాస్యులుగా చేయడమే ధ్యేయమన్నారు. 13,767 మంది వయోజన విద్య తీసుకున్నారని తెలిపారు. జిల్లాకు 85,605 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేసే లక్ష్యంతో కార్యక్రమం రూపొందించామని పేర్కొన్నారు. కలెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ నిరక్షరాస్యులకు వయోజన విద్యను అందించాలని, నిరక్షరాస్యులు వివిధ అవసరాలను సొంతంగా చేసుకొనేలా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. వయోజనులందరికీ కేవలం చదవడం, రాయడం మాత్రమే కాకుండా ఆర్థిక అక్షరాస్యత డిజిటల్ అక్షరాస్యతపై కూడా దృష్టి పెట్టబోతున్నామన్నారు. అనంతరం కలెక్టర్ కమిటీలోని వివిధ సభ్యులకు వివిధ సూచనలను చేశారు. గ్రామాలలో విద్యను అభ్యసించబోయే వారిని గుర్తించడానికి గ్రామ సహాయకులను ఎంపిక చేయాలని డిఆర్‌డిఎ పీడీని ఆదేశించారు. ఎంపిక చేసిన గ్రామ సహాయకులకు తగిన శిక్షణ ఇవ్వాలని సూచించారు. విద్యనభ్యసించే వారికి తరగతులను ఏర్పాటు చేసేందుకు అంగన్వాడీ కేంద్రాలను ఇచ్చేందుకు హాల్స్‌ను ఈ కార్యక్రమానికి ఐసిడిఎస్ పీడీకి సూచించారు. జిల్లాలోని పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలను వంట మనుషులను విద్యార్థులను పంపాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. పంచాయతీ సెక్రటరీల ద్వారా కమ్యూనిటీ హాల్స్‌ను ఈ కార్యక్రమానికి డిపిఒను ఆదేశించారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పాల్గొనే మగవారిని ఈ కార్యక్రమంలో పాలు పంచుకునేలా చేసి అక్షరాస్యతను పెంచాలని డ్వామా పీడీని ఆదేశించారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పేదల రక్తం పీల్చేయంత్రాలు స్మార్ట్ మీటర్లు : సిపిఎం


క్యూఆర్ కోడ్ పత్రాలను విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- రాయచోటి అర్బన్

ప్రభుత్వం ప్రజల ఇళ్లకు బలవంతంగా అమరుస్తున్న స్మార్ట్ మీటర్లు పేదల రక్తం పీల్చే యంత్రాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అబ్బవరం రామాంజులు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం సిపిఎం రాష్ట్ర కమిటీ ప్రచురించిన స్మార్ట్ మీటర్ల క్యూఆర్ కోడ్ పత్రాలను ఆయన ప్రజలతో కలసి ఆవిష్కరించారు. అనంతరం పార్టీ కార్యకర్తలతో కలసి పట్టణంలోని బోస్‌నగర్, సందీప్‌నగర్, దూదేకులపల్లె, సరస్వతినగర్ ప్రాంతాల్లో ఇంటింటికి తిరిగి స్మార్ట్‌మీటర్ల వినియోగం వలన ప్రజలపై పడే భారాలను, నష్టాలను ప్రజానీకానికి వివరించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్‌మీటర్లను పగులగొట్టమని చెప్పిన మంత్రి నారా లోకేష్ అధికారంలోకి వచ్చాక వైసిపి ప్రభుత్వం కంటే వేగంగా స్మార్ట్ మీటర్లను అమర్చడం ద్వారా పేదల శ్రమను కార్పొరేట్లకు దోచిపెట్టడానికి అత్యుత్సాహం చూపుతున్నారంటూ మండిపడ్డారు. బషీర్‌బాగ్‌లో ఉద్యమకారులపై కాల్పులు జరపడం ద్వారా అప్పటి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం 10 ఏళ్ల పాటు అధికారానికి దూరమైన విషయాన్ని లోకేష్ గుర్తుంచుకోవాలని కోరారు. స్మార్ట్ మీటర్ల ద్వారా సంపద అంతా కార్పొరేట్ల దగ్గరకు చేరితే ఆర్థిక అసమానతలు పెరిగి ఆర్థిక సంక్షోభాలకు కారణమవుతాయని హెచ్చరించారు. స్మార్ట్ మీటర్ల కారణంగా రైతులు, దళితులతో పాటు కొన్ని వర్గాల పేదలు ఉచిత విద్యుత్‌ను కోల్పోతారని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రజలు ఆగ్రహించి తరిమికొట్టకముందే ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల బిగింపు కార్యక్రమాన్ని రదు ్దచేసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు మాధవయ్య, ఈశ్వరయ్య, రమణయ్య, చెన్నయ్య, కదిరయ్య, గంగులయ్య, ఓబులయ్య, కిరణ్, రమేష్ పాల్గొన్నారు.

ప్రతి పాఠశాలలో స్కౌట్ యూనిట్ తప్పనిసరి

- డిఇఒ సుబ్రమణ్యం


మాట్లాడుతున్న డిఇఒ సుబ్రమణ్యం

ప్రజాశక్తి-రాయచోటి

పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు అన్ని రకాల ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో స్కౌట్ యూనిట్‌ను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని డిఇఒ సుబ్రహ్మణ్యం సూచించారు. అర్చన కళాశాలలో శుక్రవారం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లోని 250 మంది యూనిట్ లీడర్లకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనిట్ లీడర్లను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి స్కౌట్ శిక్షణ దోహదపడుతుందన్నారు. పాఠశాలల నుండి అవగాహన సమావేశానికి గైర్హాజరు అయినవారికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తామన్నారు. ఓపెన్ స్కూల్ జిల్లా కో-ఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజు మాట్లాడుతూ స్కౌట్‌లో ప్రవేశం పొందడం వల్ల విద్యార్థులకు దేహదారుఢ్యంతో పాటు విద్య, ఉద్యోగ అవకాశాలలో రిజర్వేషన్ సౌకర్యం లభిస్తుందన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ లీడర్లకు గౌరవ వేతనం ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం అర్చన కళాశాల కరస్పాండెంట్ మదన్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ వలన నిజాయితీ, సుగుణ శీలత, ధైర్య సాహసాలు, సేవాగుణం లాంటి ఉత్తమ పౌరసత్వ లక్షణాలు విద్యార్థుల్లో పెంపొందుతాయన్నారు. స్కౌటిజం ద్వారా మెరుగైన సమాజం ఏర్పడుతుందన్నారు.అనంతరం స్కౌట్ జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి అకాడమిక్ క్యాలెండర్ ప్రకారం పాఠశాలల్లో నిర్వహించవలసిన స్కౌట్ కార్యకలాపాల గురించి వారికి అవగాహన కలిగిం చారు. స్కౌట్ నందు ప్రవేశం పొందిన విద్యార్థుల, యూనిట్ లీడర్ల వివరాలను జూలై 31వ తేదీ లోపల జిల్లా స్కౌట్ కార్యాలయానికి అందజే యాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర్, అసిస్టెంట్ సెక్రటరీ భాస్కర్ రెడ్డి, అడ్వాన్స్ స్కౌట్ మాస్టర్స్ మహమ్మద్ ఖాన్, సుజాత, స్కౌట్ కమ్యూనిటీ డెవలప్మెంట్ సభ్యులు లక్ష్మిరెడ్డి, స్కౌట్ మాస్టర్స్, గైడ్ కెప్టెన్స్, కబ్ మాస్టర్స్, ఫ్లాక్ లీడర్స్ పాల్గొన్నారు.

ప్రాజెక్టులను పూర్తిచేసి సాగునీరందించడమే లక్ష్యం

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి


మంత్రిని సన్మానిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

ప్రాజెక్టులను పూర్తి చేసి సాగునీరు అందించడమే లక్ష్యమని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాయలసీమ రైతన్నకు నీళ్ల ఇవ్వడం అనేది ఫొటోకి ఫోజు ఇవ్వడం కాదని, దృఢ సంకల్పంతో సాగునీటి ప్రాజెక్టులను సక్రమంగా నడిపే నాయకత్వం కావాలని ప్రాజెక్టు పూర్తి చేయడమే టిడిపి ప్రభుత్వానికి పరమావధని పేర్కొన్నారు. గతంలో హంద్రీ-నీవా, గాలేరు-నగరి, తెలుగుగంగ వంటి ప్రాజెక్టులకు స్థాయిని తీసుకొచ్చిన నాయకుడు చంద్రబాబు నాయుడన్నారు. 1998లో తాగు నీటి ప్రాజెక్టుగా రూపురేఖలు ఇచ్చినా, వ్యూహపరంగా సీమకు పునాది వేసింది టిడిపి ప్రభుత్వమేనన్నారు. వైసిపి అధినేత జగన్ చెప్పే రూ.40 వేల కోట్ల ప్రాజెక్టులేమైనా మట్టిపనుల మధ్యే ఉన్నాయనుకున్నారా? రాష్ట్రం అప్పుల లోతుల్లో కొట్టుమిట్టాడుతుంటే, రాయలసీమలో నేరుగా సాగునీటికి ఉపయో గపడే ఒక్క అర్థవంతమైన ప్రాజెక్ట్‌ను కూడా పూర్తి చేయలేదున్నారు. హంద్రీ- నీవా పనులు నిలిచిపోయాయి, కాలువలు చీలిపోయాయన్నారు. పోలవరానికి నీరు నింపే ముందు బ్యాలెన్స్ వర్క్ ఎక్కడో మాయమయ్యాయని తెలిపారు. వైసిపి హయాంలో రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ నెలల తరబడి పనులు నిలిచి పోయింది నిజం కాదా అని ప్రశ్నించారు. వైసిపి హయాంలో ప్రాజెక్టులు పూర్తి చేయకుండా, మల్టీ మీడియా గిమిక్కులు ప్రజలపై ప్రయోగించారని, జగన్ హయాంలో పబ్లిసిటీ ఎక్కువ పనితీరు తక్కువని పేర్కొన్నారు. కర్నూలు నుంచి హైకోర్టును తరలించడమే అసలైన ద్రోహమని కడప, అనంతపురం మెడికల్ కాలేజీల పనులు ఆపడం నిజం కదా అన్నారు. అమరావతిని రాళ్ల నగరం అంటూనే, రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధిని వైసిపి నేతలు అడ్డుకుంటున్నారన్నారు. ప్రజలు తప్పు మర్చిపోతారు కానీ ద్రోహాన్ని క్షమించరు అందుకే ప్రతిపక్ష హోదా లేకుండా చేశారున్నారు. వైసిపి నేతలు మేలుకోనీ సాగునీటి ప్రాజెక్టులకు కొత్త ఊపునివ్వండి, పాత ప్రభుత్వాల పనులకు మీపేరు వేసుకునే తంతు మాని హంద్రీనీవా పేరు చెప్పాలంటే నిజంగా ఆ ప్రాజెక్టుపై కనీస గౌరవం ఉండాలిన్నారు.

మంత్రిని కలిసిన మార్కెట్ కమిటీ చైర్మన్

రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి స్వగ్రామంలో రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి కలిశారు. చైర్మన్ పదవి ఇచ్చినందుకు ధన్య వాదాలు తెలిపారు. దుశ్శాలువాతో గజమాలతో ఘనంగా సన్మానించారు. ఆయన వెంట టిడిపి పట్టణ అధ్యక్షులు బోనమల ఖాదరవల్లి, టిడిపి నాయకులు సుబ్బయ్య నాయుడు, మట్లి శ్రీనివాస్ నాయుడు, మేఘనాథరెడ్డి ఉన్నారు.

పాదయాత్రకు బిహెచ్‌పిఎస్ మద్దతు

- బిసి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

దేశం కోసం 1960లో జరిగిన యుద్ధంలో అమరవీరులైన యాదవుల పేరును మిలటరీ బెటాలియన్‌కు పెట్టాలని డిమాండ్ చేస్తూ కాశీ నుండి కన్యాకుమారి మీదుగా ఢిల్లీకి శాంతియుత పాదయాత్ర చేస్తున్న యాదవులకు తమ మద్దతు ప్రకటిస్తున్నట్లు బిసి హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బోడెం రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1960లో ఇండియా, చైనా మధ్య జరిగిన యుద్ధంలో భారతదేశానికి చెందిన యాదవులైన సైనికులు అమరవీరులు అయ్యారన్నారు. ఆ సమయంలో అక్కడ ఓ స్మారక చిహ్నాన్ని ఏర్పాటు చేశారని, తదనంతరం యుద్ధంలో అమరులైన యాదవుల పేరును ఓ మిలిటరీ బెటాలియన్‌కు పెడతామని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. అయితే తదనంతరం ప్రభుత్వం యాదవుల పేరు పెట్టలేదని, ఆ సామాజిక వర్గానికి చెందిన నాయకులు మిలిటరీ బెటాలియన్‌కు యాదవుల పేరు పెట్టాలని డిమాండ్ చేస్తూ కాశీ నుండి కన్యాకుమారి మీదుగా ఢిల్లీకి శాంతియుత పాదయాత్ర చేస్తున్నారన్నారు. వారి పాదయాత్ర 21వ తేదీన పట్టణ శివార్లలోని అమ్మచెరువుమిట్టకు చేరుకుంటుందని, దీనికి బిసి హక్కుల పోరాట సమితి మద్దతిస్తూ వారికి సాదర స్వాగతం పలుకుతుందన్నారు.

నిధులు విడుదల చేయాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: విద్య హక్కు చట్టం ప్రకారం విద్యార్థులకు నిధులు విడుదల చేయాలని బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ డిమాండ్ చేసారు. శుక్రవారం బివైస్ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ఎఒకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పునీత్ మాట్లాడుతూ 2009లో కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ఎ ద్వారా 6 నుండి 14 ఏళ్ల పిల్లలకు వారి ఆర్థిక పరిస్థితులు, మరే ఇతర కారణాల వల్ల విద్యకు దూరం కాకూడదని విద్యాహక్కు చట్టాన్ని తెచ్చారన్నారు. అలాంటి స్కీం ద్వారా పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు 2024-25కి సంబంధించిన ఫీజులు రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలకు చెల్లించకపోవడంతో పాఠశాలల యాజమాన్యం తల్లిదండ్రులు దగ్గర బలవంతంగా రూ.30 నుండి రూ.50 వేల వరకు వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. ఫీజులు చెల్లించని వారికి సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, గత ఏడాది బకాయిలే చెల్లించకుండా నూతనంగా ఆర్‌టిఎ కింద దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వం చెప్పడం, విద్యాహక్కు ప్రవేశాలను అపహాస్యం చేయడమేనన్నారు. డిఇఒ, ఆర్‌ఐఒ వెంటనే విద్యహక్కు చట్టం ఫీజులను చెల్లించే విధంగా సిఫార్సు చేయాలని, ప్రభుత్వం ఫీజులు చెల్లించే వరకు తల్లిదండ్రులను ఒత్తిడి చేయొద్దని ఆదేశాలు జారీ చేయాలన్నారు. విద్యాశాఖ మంత్రి వెంటనే స్పందించి విద్యాహక్కు చట్టం నిధులను విడుదల చేసి, విద్యార్థులు వారి తల్లిదండ్రులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో బహుజన యువసేన నాయకులు జిలాని బాషా, శశికుమార్, వినయ్, పూర్ణ, శ్రీనివాసులు, బాలకృష్ణ, వేణుగోపాల్, ద్వారకనాథ్, దేవేష్, వంశీ, ఆరిఫ్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకం పర్యావరణానికి విఘాతం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని చారిత్రాత్మక బెసెంట్ దివ్యజ్ఞాన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వ్యర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీదేవి మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణంపై, మానవ ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపించి అనేక అనర్థాలకు దారి తీస్తున్నాయన్నారు. ప్రభుత్వాలు చేపట్టే పర్యావరణ సంరక్షణ కార్యక్రమాలకు మనం కూడా మనవంతు సాయం అందించి ప్లాస్టిక్ రహిత జీవన విధానాలను పెంపొందించుకుని మనల్ని మనం కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. రిసోర్స్ పర్సన్ డాక్టర్ డి.శ్రీనివాసులు మాట్లాడుతూ మానవ చర్యలవల్ల ప్రకృతి చాలా తీవ్రంగా దెబ్బతింటున్నదని, ప్లాస్టిక్ రహిత జీవన విధానాలను ఆలవరచుకోవడం ద్వారా పర్యావరణాన్ని గణనీయంగా పరిరక్షించుకోవచ్చని పిలుపునిచ్చారు. అధ్యాపక సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మలిగి రాఘవరెడ్డి, వృక్షశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ శైలజ, రసాయనశాస్త్ర అధ్యాపకులు, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ జి.చిన్నారెడ్డి తదితరులు విద్యార్థులు ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో పెద్దఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

'ఆదిత్య'లో కెరీర్ ప్రిపరేషన్‌పై అవగాహన

ప్రజాశక్తి-మదనపల్లె

స్థానిక ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఫైనల్ ఇయర్ విద్యార్థుల కోసం "కెరీర్ ప్రిపరేషన్" అనే ప్రత్యేక కార్యక్రమాన్ని కళాశాల వారు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ ఐటి సంస్థ హెచ్‌పిఇలో హెచ్‌ఆర్ మేనేజర్‌గా పని చేస్తున్న పి.జగదీష్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు మాక్ ఇంటర్వ్యూలు, గ్రూప్ డిస్కషన్‌లు నిర్వహించారు. ప్రస్తుత ఉద్యోగ మార్కెట్ పరిస్థితులు, అందులో మెరుగు ఉద్యోగ అవకాశాలు పొందేందుకు అవసరమైన నైపుణ్యాలు, అభ్యాస పద్ధతులపై జగదీష్ మార్గనిర్దేశం చేశారు. ప్రతిభ, ప్రొఫెషనలిజం, కమ్యూనికేషన్ స్కిల్స్‌తో పాటు తాజా టెక్నాలజీ మార్పులకు అనుగుణంగా మనం స్వయం మెరుగుదల సాధించాలని పేర్కొన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ విజయానికి ఇలాంటి ప్రిపరేషన్ సెషన్లు ఎంతో దోహదపడతాయని తెలిపారు. డీన్ ఆఫ్ అకాడమిక్స్ డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకొని తమ కెరీర్ అభివృద్ధికి ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కేదార్ గౌరవ్, వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిఒ 36ను వెంటనే అమలు చేయాలి

సిఎం, మున్సిపల్ మంత్రి చిత్రపటాలకు దండాలు పెడుతూ కార్మికుల నిరసన


సిఎం, మంత్రి చిత్రపటాలకు దండాలు పెడుతున్న కార్మికులు, సంఘీభావం తెలుపుతున్న మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

జిఒ నంబరు 36ను వెంటనే అమలు చేయడం ద్వారా తమను కష్టాల బారినుండి కాపాడాలని మున్సిపల్ కార్మికులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా ఆరవ రోజు శుక్రవారం కూడా రాయచోటిలో కార్మికులు సమ్మెను కొనసాగించారు. శిబిరంలో ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మున్సిపల్ పరిపాలనా శాఖ మంత్రి నారాయణ చిత్రపటాల ముందు మోకరిల్లి దండాలు పెడుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, మున్సిపల్ కార్మిక యూనియన్ నేతలు శంకరయ్య, బి.వి.రమణ, చెన్నయ్య మాట్లాడుతూ కార్మికుల న్యాయసమ్మతమైన సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందంటూ విమర్శించారు. సమ్మె కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలలో ప్రజలు తీవ్ర తాగునీటి ఇబ్బందిని, చెత్త తొలగించని సమస్యను ఎదుర్కొంటున్నప్పటికి పాలకులు చూసీచూడనట్లుగా వ్యవహ రిస్తుండడం దారుణమన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే కార్మికుల సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలంటూ కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్, పారిశుధ్య కార్మికులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

కార్మికులకు మున్సిపల్ పాలకవర్గం సంఘీభావం

మున్సిపల్ కార్మికుల న్యాయసమ్మతమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాబా, వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవార కౌన్సిలర్లు ఈశ్వర్ ప్రసాద్, కౌన్సిలర్ల కుటుంబీకులు, వైసిపి నేతలు ఫయాజ్ అహమ్మద్, శ్యామ్ కుమార్, బుజ్జిబాబులతో కలసి వారు కార్మికుల దీక్షాశిబిరాన్ని సందర్శించి వారికి సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతున్న కార్మికుల సమస్యల పరిష్కారం పట్ల పాలకవర్గం చిత్తశుద్ధితో ఉందన్నారు. వారికి అవసరమైన తీర్మానాలను చేసేందుకు కూడా కౌన్సిల్ సభ్యులు సిద్ధంగా ఉన్నా రన్నారు. కార్మికుల సమ్మెతో పట్టణంలో తాగునీటి సమస్యతో పాటు పారిశుధ్య సమస్య తలెత్తుతోందన్నారు. వార్డు ఇన్‌ఛార్జులుగా చలామణి అవుతున్న కొందరు కూటమినేతలు తాగునీటి సరఫరాకు అంతరాయం కలిగిస్తున్నట్లు ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం మొండిపట్టుదలను వీడి కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజాగ్రహానికి గురికాక తప్పదంటూ వారు హెచ్చరించారు.

కళ్లకు గంతలు కట్టుకుని కార్మికుల నిరసన

రాజంపేట అర్బన్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం పుర పాలక కార్యాలయం వద్ద వినూత్న పద్ధతిలో కళ్లకు గంతలు కట్టుకుని కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్. చంద్రశేఖర్, మునిసిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వి.రమణ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డి.ఎ, కరువు భత్యం ఇవ్వాలన్నారు. దుమ్ము, ధూళి, దుర్గంధం భరిస్తూ పట్టణ పరిశుభ్రతకు పాటుపడుతున్న మున్సిపల్ కార్మికుల పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయినప్పటికీ మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని పేర్కొన్నారు. గత 17 రోజుల సమ్మెకాలపు ఒప్పందాలైన రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్, హామీలకు జిఒలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. నాలుగు సంవత్సరాలుగా అట్టడుగు వర్గాలుగా ఉన్న మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు పరిష్కరించాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి లక్ష్మీదేవి, ప్రసాద్, ఎం.రమణ పాల్గొన్నారు.

బి.కొత్తకోట : కార్మికుల సమస్యలను విస్మరిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మూల్యం చెల్లించుకోక తప్పదని సిపిఎం, సిఐటియు నాయకులు హెచ్చరించారు. మున్సిపల్ కార్మికుల సమ్మెలో భాగంగా ప్రజానాట్య మండలి కళాకారులు స్వరకొండ్ల చెన్నకృష్ణ, డప్పు సహకారం మావిళ్ళ వెంకటాచలపతి కార్మికుల సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు, సిఐటియు జిల్లా నాయకులు ఎస్.సురేంద్ర మాట్లాడుతూ ప్రజల శ్రేయస్సు కోసం అహర్నిశలు శ్రమిస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించకపోవడం దురదృష్టకరమన్నారు. కార్మికుల న్యాయపరమైన సమస్యలను పరిష్కరించకుంటే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.


రాజంపేట :కళ్లకు గంతలతో నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మెరుగైన వైద్య సేవలు అందించాలి

- సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

ఆస్పత్రులకు వచ్చే గ్రామీణ రోగులకు సకాలంలో మెరుగైన వైద్యసేవలు అందించాలని మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక సిహెచ్‌సిని ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రి నిర్వహణ, పరిశుభ్రత, రోగులకు అందుతున్న సేవలు. మందుల పరిస్థితి, డాక్టర్లు, సిబ్బంది కొరత, ఓపి వివరాలు మెడికల్ ఆఫీసర్ తేజస్విని అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్ ఎక్రే విభాగం. ఆపరేషన్ థియేటర్, మెటర్నటీ వార్డు, మందుల పంపిణీ విభాగాన్ని పరిశీలించారు. సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. అవసరమైన మందులు ఎప్పుడు అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. స్నేహపూర్వకంగా మెలిగి విధులు సక్రమంగా నిర్వహిస్తున్నారా? లేదా అన్న విషయాలను సిఎంఒ నుంచి ప్రజల అభిప్రాయాలను సేకరిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ సేవాధృ కృదంతో విధులు నిర్వహిస్తూ రోగులకు వైద్య సేవలు అందించి అనుకున్న లక్ష్యాల మేరకు పనిచే యాలన్నారు. సమస్యలు ఉంటే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎర్రసా నిపల్లె, గోపిదిన్నె సంపద సృష్టి కేంద్రాలను పరిశీలించారు. గోపిదిన్నె పంచాయతీ నుంచి పొడి చెత్త తడిచెత్త సేకరణ జరగలేదంటూ సీఎంకు కార్యాలయానికి ప్రజాభిప్రాయం వెల్లిందన్నారు. పంచాయతీ కార్యదర్యులు ప్రజలకు అవగాహన కల్పించి పారిశుధ్య కార్మికులచే చెత్త సేకరణ సక్రమంగా జరిగే విధంగా చూడా లని ఎంపిడిక, థామస్‌కు సూచించారు. ఆయన వెంట నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ అమరనాథరెడ్డి, తహశీల్దార్ శ్రీనివాసులు, ఎంఇఒ తాగ్యరాజు ఉన్నారు.

ప్రజల తోడ్పాటుతో డెంగీ నివారణ సాధ్యం

ప్రజాశక్తి-రామసముద్రం

మండల పరిధిలోని చెంబకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డెంగీ మాసోత్సవాల్లో భాగంగా శనివారం చెంబకూరు ప్రాథమికఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు జాహ్నవి, చరిత ఆధ్వర్యంలో డెంగీపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది, జడ్‌పిహైస్కూల్ విద్యార్థులచే చెంబకూరు బస్టాండ్ కూడలిలో మానవహారం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ దోమలకు మురుగునీరు ఆవాసాలు కాకుండా చూసుకోవాలని తెలిపారు. దోమతెరలు వాడాలని, దోమలు పుట్టరాదు - దోమలు కుట్టకుట్టరాదని, చిన్న దోమ పెను ప్రమాదమని తెలిపారు. పరిసరాలను శుభ్రంగా చేసుకోవాలని ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని తెలిపారు. ప్రజల తోడ్పాటుతో డెంగీ భూతాన్ని తరిమికొట్టాలని తెలిపారు. ఎవరికైనా జ్వరాలు వస్తే రక్త పరీక్షలు తప్పనిసరిగా చేయించ ుకోవాలని అన్నారు. దోమతెరలు వాడి దోమకాటు నుండి రక్షణ పొందాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి టీవీ.రమణ, సూపర్‌వైజర్ డి.పద్మజ సిహెచ్‌ఒ శిరీష, ఫార్మాసిస్ట్ మంజుల, హెచ్‌ఎం రమేష్ బాబు, పంచాయతీ కార్యదర్శి రెడ్డి శేఖర్, గౌరమ్మ, శారద, వెంకటలక్ష్మీ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.



పాఠశాల ఎదుట ఏర్పాటు చేసిన సిమెంట్ బల్లపై కూర్చున్న విద్యార్థులు

స్వచ్ఛందంగా సిమెంట్ బల్లలు ఏర్పాటు

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రమైన గాలివీడులో బస్ స్టాప్‌ల వద్ద ప్రయాణికులు కూర్చోవడానికి సిమెంట్ బల్లలను గౌర శ్రీనివాసులు స్వచ్ఛందంగా ఏర్పాటు చేశారు. రాయచోటి నుంచి గాలివీడు వరకు 28 కిలోమీటర్లు రోడ్డుపైన 44 గ్రామాలు ఉన్నాయి. రాయచోటి రింగ్ రోడ్డు ఎగువ అబ్బవరం నుంచి గాలివీడు బాలుర ఉన్నత పాఠశాల వరకు ప్రతిగ్రామం వద్ద ప్రయాణికులు, విద్యార్థులు, మహిళలు కూర్చోవడానికి సిమెంటు బల్లలు ఏర్పాటు చేశారు. గాలివీడు గ్రామం బాలుర ఉన్నత పాఠశాల సమీపంలో నివాసమున్న ఆయన తన తండ్రి ఆశయాల మేరకు సంఘానికి సమాజానికి ఉపయోగపడే వ్యక్తిగా ఉండాలని ఉద్దేశంతో మండల కేంద్రంలో శ్రీనాథ్ ఫంక్షన్ హాలను ఏర్పాటు చేశానని అన్నారు. ప్రయాణికులు, విద్యార్థులు, ప్రజలు కూర్చోవడానికి అనుకూలంగా ఉండడానికి సిమెంట్ బల్లలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పాఠశాల ఆవరణం జలమయం

ప్రజాశక్తి-వీరబల్లి



చెరువును తలపిస్తున్న పాఠశాల ఆవరణం

మండలంలో రెండు రోజులుగా కురు స్తున్న వర్షానికి వీరబ ల్లిలోని జడ్‌పి హైస్కూల్ మైదానం వర్షం నీటినితో నిండిపోయి చెరువును తలపిస్తోంది. ప్రధాన రోడ్డుపై ప్రవహించే నీరంతా పాఠశాలలోకి రావడంతో విద్యార్థులు పాంశాల లోపలికి రావాలంటే చాలా ఇబ్బంది పడుతున్నారు. స్కూల్ సమీపంలో ఖాళీ స్థలం ఎక్కువగా ఉండటంతో వర్షపు నీటికి విష పురుగులు సంచరించే అవకాశం ఉందని తల్లిదండ్రులు భయభ్రాంతులకు గురవుతున్నారు. పాఠశాల మైదానమంతా నీటితో నిండి పోవడంతో విద్యార్థులు బడికి రావడానికి భయపడుతున్నారని తల్లిదండ్రులు చెబుతున్నారు. వర్షం పడిన ప్రతి సారి ఇదే పరిస్థితి ఉంటుందని, వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోగా, పాఠశాల మైదానంలో నిలిచిన వర్షపు నీరును దిగువ ప్రాంతానికి వెళ్లేటట్లు చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. అధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపించాలని కోరారు.

కూటమి పాలన అవినీతిమయం : ఎంపిపి

ప్రజాశక్తి-పుల్లంపేట



మాట్లాడుతున్న ఎంపిపి వెంకటసుబ్బారెడ్డి

కూటమి పాలన అవినీతిమయమైందని, మండలంలో అవినీతి అరాచక పాలన సాగుతుం దని ఎంపిపి ముద్దా వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల సభా భవనంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మండలంలో 3200 మంది ఉపాధి హామీ కూలీలు ఉండగా ఒక వత్తలూరు పంచాయతీలోనే 1200 పైచిలుకు ఉపాధి కూలీలు ఉన్నారని, ఆరు వారాల్లో రూ.65లు దోచుకున్నారని ఆరోపించారు. ఒక ఒక ఉపాధి హామీ కూలి ఫోటో మూడు మస్టర్లలో వాడుతూ ఇంతటి అవినీతికి పాల్పడుతున్న ఎన్నోసార్లు అధికారులకు పీడీకి ఫిర్యాదు చేసిన కూడా పట్టించుకోలేదన్నారు. అనంత సముద్రం ఎంపిటిసి భూ సమస్యను ఎన్ని సార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని, సాక్షాత్తు జెసి నుంచి ప్రొసీడింగ్ ఆర్డర్స్ ఇచ్చినా కూడా అధికారులు పట్టించు కోలేదని అన్నారు. నా సొంత భూమి 50 సెంట్లు సర్వే చేసి సరిహద్దులు చూపించాలని దరఖాస్తు చేసుకుంటే తహశీల్దార్ కోర్టుకు వెళ్ళమనడం ఎంతవరకు న్యాయమని ఆయన ప్రశ్నించారు. దీనికి స్పందించిన తహశీల్దార్ పుల్లారెడ్డి ఈ భూమి ఎక్సెస్‌లో ఉందని దీనిపై తన పరిధిలో లేదని అందుకే తాను కోర్టుకు వెళ్ళమనడం జరిగిందని అన్నారు. ఎంఇఒ నాగా తిరుమల్ రావు మాట్లాడుతూ మండలంలో 4752 మందికి తల్లికి వందనం పథకం వర్తించిందని, మండలంలో ఏడు పాఠశాలలో మోడల్ స్కూల్‌గా అప్‌డేట్ అయ్యాయని అన్నారు. వ్యవసాయ శాఖ అధికారి శ్రీకర్ మాట్లాడుతూ 153మంది రైతులకు ఇకెవైసి చేయలేదని వారికి అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ పథకాలు రావాలం టే ఇకెవైసి తప్పకుండా చేయించుకోవాలన్నారు. విద్యుత్‌శాఖ ఎఇకుమార్ నాయుడు మాట్లాడుతూ మండలంలో పట్ట పగులు వీధిలైటు వెలుగుతూ విద్యుత్తు వృధా జరుగుతుందని, విద్యుత్ వృధా కాకుండా సర్పంచులు పూర్తిగా సహకరించాలని కోరారు.తాగునీటి సమస్యపై ఎక్కడ సమస్య తలెత్తిన తమను సంప్రదిస్తే వెంటనే వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. మండలానికి ఎంపీ నిధులు కింద మూడు బోర్లు మంజూరయ్యాయని కావున ప్రజలు తాగునీటి సమస్య తలెత్తిన వెంటనే తనను సంప్రదిం చాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి జై శంకర్ నాయుడు. వైస్ఎంపిపి2 భోగా వెంకటరత్నమ్మ, పంచాయతీ కార్యదర్శుల, సర్పంచులు , మండల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించాలి



నిమ్మనపల్లి :విద్యార్థులను విచారిస్తున్న ఎంపిడిఒ, డిప్యూటీ ఎంపిడిఒ, తహశీల్దార్

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించాలని తాహశీల్దార్ తపస్విని, ఎంపిడిఒ రమేష్ బాబు, డిప్యూటీ ఎంపిడిఒబాలరాజు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని స్వయంగా రుచి చూసి నాణ్యతను పరిశీలించారు. పలు రికార్డులను, వంటకు వాడుతున్న సన్న బియ్యం, ఇతర సరుకులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాల, కళాశాలలోని విద్యార్థులకు పౌష్టికాహారాన్ని ప్రభుత్వం అందిస్తోందని అన్నారు. విద్యార్థులకు గతంలో ఇస్తున్న బియ్యంను మార్చి ప్రస్తుతం సన్నబియ్యాన్ని అందుబాటులోకి తెచ్చిందన్నారు. మధ్యాహ్నం భోజనం పథకంలో రాజీ లేకుండా నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. కోడిగుడ్లు, రాగి జావా, చిక్కీలు వంటివి కూడా మధ్యాహ్నం భోజనంలో భాగంగా అందిస్తున్నట్లు తెలిపారు. భోజనాన్ని రుచికరంగా తయారు చేయకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్వయంగా విద్యార్థులతో చర్చించి పాఠశాల నిర్వహణ, భోజన వసతులు, పరిశుభ్రత పై వివరాలు తెలుసుకున్నారు. క్రమం తప్పకుండా అధికారుల తనిఖీలు ఉంటాయని సిబ్బంది తమ విధులను విధిగా నిర్వర్తించాలన్నారు. **రామాపురం :** మండలంలోని బాలికల బాలికల గృహాలను ఎంపిడిఒ విశ్వనాథ్ తనిఖీ చేశారు. మండలంలోని నీలకంఠరావుపేట ఎస్‌సి బాలికల వసతి గృహం, కస్తూరిబా పాఠశాల, ఆదర్శ పాఠశాల బాలికల వసతి గృహాలను పరిశీలించారు. విద్యార్థుల హాజరు రికార్డులు, నిల్వ ఉన్న నిత్యావసర సరుకుల వివరాలు, వంటశాలలు స్నానాలగదులు మరుగుదొడ్లు ఆయన తనిఖీ చేశారు. పిల్లలకు మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసు కున్నారు. ఎంపిడిఒ వెంట ఎంఇఒ2 జయచంద్ర, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ శ్యామలాదేవి, కెజిబివి స్పెషల్ ఆఫీసర్ పుష్పలత, నీలకంఠరావుపేట జడ్‌పి హైస్కూల్ హెచ్‌ఎం వనిత రెడ్డి, వార్డెన్ అనుపమ పాల్గొన్నారు. **కలికిరి:** హాస్టల్ విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని తహశీల్దార్ హరికుమార్ వార్డెన్‌కు సూచించారు. మండలంలోని వెనుకబడిన తరగతుల హాస్టల్ ను ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల కొరకు మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని, వర్షాకాలం, శీతాకాలంలో తాగునీటిని కాంచి వడ గొట్టి పిల్లలకు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఇఒ నాగార్జున, సర్వేయర్ రెడ్డప్ప, జూనియర్ అసిస్టెంట్ గిరిప్రసాద్, విఆర్ఒ నరేంద్ర పాల్గొన్నారు.**బి.కొత్తకోట :** మండల స్పెషల్ ఆఫీసర్ నీలకంఠ రెడ్డి, తహశీల్దార్ బాబ్‌జాన్, ఎంపిడిఒ కృష్ణవేణి, మున్సిపల్ కమిషనర్ జీవి పల్లవి, స్థానిక ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ భవనము శిథిలావస్థకు చేరడం, డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంపై ఆరా తీశారు. వండిన పదార్థాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వాసుదేవరావు ఎంఇఒ, రెవెన్యూ అధికారులు, స్థానిక వార్డెన్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.



కలికిరి : విద్యార్థులతో మాట్లాడుతున్న తహశీల్దార్ హరికుమార్

మార్కెట్ కమిటీ చైర్మన్ల నియామకం




షఫీనాయక్‌ను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎస్ఎండి షఫీనాయక్‌ను ప్రభుత్వం ప్రకటించడంతో టిడిపి కార్యకర్తలు బాణాసంచా కాల్చి, కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం షఫీనాయక్‌ను పూలమాలలతో ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని అన్నారు. దాదాపు 20 సంవత్సరాలు టిడిపిలో ఉంటూ రాజంపేట పార్లమెంట్ డాక్టర్స్ సెల్ ప్రధాన కార్యదర్శిగా పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేశానని అన్నారు. సిఎం చంద్రబాబు తన సేవలను ప్రాధాన్యత కల్పించారని అన్నారు. విద్యా శాఖ మంత్రి లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లిర రాంప్రసాద్‌రెడ్డి, లక్ష్మీప్రసాద్‌రెడ్డి, మండల నాయకులు మదన్మోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు కావలి ఆంజనేయులు, కాంట్రాక్ట్ రాజు, డీలర్ అన్వర్ మండల తెలుగు యువత ప్రధాన కార్యదర్శి ఫక్కీరయ్య, సంజీవరాజు, షేక్ ఇమ్రాన్, ఎలమంద రవీంద్ర, మసూద్, ముబారక్, ఓబు లేసు టిడిపి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు

మదనపల్లె అర్బన్ :మదనపల్లె టమోటా మార్కెట్ కమిటీ చైర్మన్‌గా జనసేన సీనియర్ నాయకులు, ఉమ్మడి చిత్తూరు జిల్లాల ప్రధాన కార్యదర్శి జంగాల శివరాం రాయల్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా శివరాం రాయల్ మాట్లాడుతూ మంచి ప్రభుత్వం, మంచి చేసి చూపిస్తామని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ చూపిన బాటలో నడిచి ఆసియా ఖండంలోనే అతిపెద్ద మార్కెట్ అయిన మదనపల్లె టమోటా మార్కెట్ ను అభివృద్ధి వైపు నడిపిస్తామన్నారు. శుక్రవారం కమ్మవీధి జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీ రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రామదాస్ చౌదరి సమక్షంలో జంగాల శివరామ్ రాయల్ మార్కెట్ చైర్మన్ కావడం పట్ల కూటమి హర్షం వ్యక్తం చేస్తూ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర చేనేత విభాగం నాయకులు అడపా సురేంద్ర, రాజ్ భవన్ రాజా, సుబ్రహ్మణ్యం, కాశీ శ్రీరామ్ వాల్మీకి, ప్రభాకర్, మల్లెం ప్రకాష్ నాయుడు, పసుపులేటి శ్రీనివాసులు, సికిందర్ పాల్గొన్నారు.



శివరామ్‌ను సన్మానిస్తున్న కూటమి నాయకులు

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎపిఎం

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని డ్వాక్రా మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని వెలుగు ఎపిఎం ఖాదర్‌వలి కోరారు. శుక్రవారం ఓదివీడు, వంగిమళ్ళ గ్రామ సమాఖ్య 6వ మహాసభ సమావేశంలో ఏర్పాటు చేశారు. సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సభ్యులు ఒక్కొక్కరు రెండు నుంచి ఐదు లక్షల రూపాయలు సంఘాల ద్వారా రుణాలు తీసుకొంటున్నారని, ఆ రుణాలతో మంచి జీవనోపాధులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. క్రమం తప్పని సమావేశాలలో అన్ని రకాల లావాదేవీలు జరపాలన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.40 లక్షల లావాదేవీలు జరిగి రూ.లక్ష ఆదాయం వచ్చిందని తెలిపారు. సమాఖ్య నూతన పదాధి.కారులను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. అధ్యక్షురాలిగా యం. శైలజ, కార్యదర్శిగా పి.నాగపుష్పావతి, కోశాధికారిగా ఎస్. లావణ్య లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సిసిలు సుధాకర్, గంగాధర్ విఒఎ భాగ్యమ్మ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శంకర్ రెడ్డి, రైతు మిత్ర వెంకటేష్, సభ్యులు పాల్గొన్నారు.



డ్వాక్రా మహిళలకు సూచనలు ఇస్తున్న ఎపిఎం ఖాదర్‌వలి

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు : కెకె



టిడిపి నాయకులతో కలసి తహశీల్దార్‌తో మాట్లాడుతున్న కెకె చౌదరి

ప్రజాశక్తి-పుల్లంపేట

రాష్ట్రంలో రాజకీయాలకతీతంగా సంక్షేమ అభివృద్ధి ఫలాలు ప్రతి ఒక్కరికీ అందాలని ఖాదీ గ్రామీణ పరిశ్రమల బోర్డు చైర్మన్ కెకె చౌదరి పేర్కొన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో కార్యకర్తలు, ప్రజల నుంచి వచ్చేఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం ఈ ఫిర్యాదులు విచారణ చేసి సత్వరమే పరిష్కరించాలని తహశీల్దార్‌ను కోరారు. తనకున్న 50 సెంట్లు భూమిని సర్వే చేసి సరిహద్దులను చూపించమని దరఖాస్తు చేసుకుంటే కోర్టుకు వెళ్ళమనడం ఎంత దారుణమని ఎంపిపి వెంకట సుబ్బారెడ్డి కెకె చౌదరితో చర్చించారు. ప్రతిపక్షంలోని వారు గానీ, అధికార పక్షంలోని వారు గానీ ఎంతటి వారైనా సరే, ఎవరైనా సరే అవినీతికి అన్యాయానికి పాల్పడితే వారిపై విచారించి కఠిన చర్యలు తీసుకోవాలని తహశీల్దార్‌కు సూచించారు. ప్రభుత్వం వచ్చే నాలుగు సంవత్సరాల వ్యవధిలో ప్రజల కోసం అనేకమైన అనేక సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోందని, ఇది పూర్తిగా ప్రజా ప్రభుత్వమని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు విశ్వనాథ నాయుడు, నారాయణనాయుడు, మురళి, జనార్ధన్ , సుధాకర్ నాయుడు, కృష్ణం నాయుడు, సుధాకర్ రెడ్డి,రాజేష్ రెడ్డి,నూకల పనిష్, అధికారులు నాయకులు పాల్గొన్నారు.



అంగన్వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న సిడిపిఒ సుజాత

అంగన్వాడీ కేంద్రాల్లో సిడిపిఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండల పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలను శుక్రవారం సిడిపిఒ ఎ.సుజాత ఆకస్మికంగా తనిఖీ చేశారు. కన్యమడుగు, అప్పమ్మగారిపల్లి, గోపిదిన్నె అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులను, హాజరు పట్టిని పరిశీలించారు. బాలింతలు, గర్భిణులు అందించాల్సిన పౌష్టికాహారం సక్రమంగా అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. గర్భిణులు పౌష్టికాహారం తప్పకు తీసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రంలో ఇచ్చే గుడ్లు, చిక్కీలు, మందులను సద్వినియోగం చేసుకో వాలని చెప్పారు. అంగన్వాడీ కేంద్రం పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రానికి వచ్చే పిల్లలు, గర్భిణులు, బాలింతల పేర్లను నమోదు చేయాలని సూచించారు. ఆధార్ లేని పిల్లలకి తల్లిదండ్రులతో మాట్లాడి సర్టిఫికెట్లు తీసి ఆధార్ చేయించాలని సూచించారు.

చంద్రబాబు హామీలకు గ్యారంటీ లేదు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నందలూరు

కూటమి ప్రభుత్వం ఏడాది పాలన మొత్తం మోసాల మయమని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నందలూరు గ్రామపంచాయతీ లోని షాది ఖానాలో ఏర్పాటుచేసిన మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా వైసిపి స్టేట్ సెక్రటరీ వినీషరెడ్డి, ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వైసిపి తప్పక విజయం సాధిస్తుందని అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు ఇప్పటివరకు పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. కూటమి పాలన బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీగా మారిందని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వైసిపి అధ్యక్షులు వై.ఎస్.జగన్ సూచనలు మేరకు బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో ఇంటింటికి తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందని సూచించారు. కార్యక్రమంలో రాజంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొబ్బిళ్ళ త్రినాథ్, రాష్ట్ర గ్రీవెన్స్ ప్రధాన కార్యదర్శి భూమన శివశంకర్ రెడ్డి, జడ్‌పిటిసి గడికోట వెంకట సుబ్బారెడ్డి, సౌమ్యనాథస్వామి ఆలయ మాజీ చైర్మన్ అరిగెల సౌమిత్రి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మైనార్టీ రాష్ట్ర కార్యదర్శిగా జాఫర్ అలీఖాన్

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్ వైసిపి రాష్ట్ర మైనార్టీ కార్యదర్శిగా రాయచోటి పట్టణానికి చెందిన మయాన జాఫర్‌అలీఖాన్ నియమితులయ్యారు. పార్టీ ఆవిర్భావం నుంచి జాఫర్ వైసిపిలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. రాయచోటి మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడిగా కూడా పనిచేశారు.ఈ సందర్భంగా జాఫర్ మాట్లాడుతూ పార్టీ అధిష్టానం తన సేవలను గుర్తించడం, పదవిని కట్టబెట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. తన నియామకానికి కృషిచేసిన రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు శ్రీకాంత్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, సుగవాసి బాలసుబ్రమణ్యం, వైసిపిజిల్లా అధ్యక్షులు అమర్నాథ్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : రోడ్డు ప్రమాదంలో ఐదుగురు గాయపడిన సంఘటన శుక్రవారం వేకువజామున మండలంలో జరిగింది. తాలూకా ఎస్ఐ చంద్రమోహన్ కథనం మేరకు.. పీలేరుకు చెందిన తరుణ్, అష్రఫ్, నిఖిల్, బాలాజీ, ప్రేమ్ కుమాం సొంత పనిమీద గురువారం కారులో మదనపల్లెకు వచ్చారు. పని ముగించుకొని శుక్రవారం వేకువజామున రెండున్నర గంటలకు కారులో పీలేరుకు తిరుగు ప్రయాణం అయ్యారు. మార్గమధ్యంలోని కొత్తవారిపల్లి సమీపంలోని కొత్త బైపాస్ రోడ్డు వద్ద కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఐదుమంది గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన వాహనదారులు 108కు సమాచారం అందించి క్షతగాత్రులను మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని కూలీ మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: గుర్తు తెలియని వాహనం ఢీకొని కూలి మృతి చెందిన సంఘటన గురువారం అర్ధరాత్రి మదనపల్లెలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. నీరు గట్టువారిపల్లెలోని కనకదాసనగర్ కు చెందిన గోళ్ళ వెంకటరమణ నాయుడు (56) స్థానిక టమోటా మార్కెట్ యార్డులో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అర్ధరాత్రి 12 వరకు టమోటా క్రేట్లను లారీలకు లోడ్ చేసి నడుచు కుంటూ ఇంటికి బయల్దేరాడు. మార్గమధ్యంలోని అనపగుట్టకు వెళ్లే దారిలో రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో వెంకట్రమణ నాయుడు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృత ుడికి భార్య కళావతి కుమార్తె ప్రసన్నలక్ష్మి, కుమారులు సాయికుమార్, మని కంఠ ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇరు గ్రూపుల మధ్య ఘర్షణ : కేసు నమోదు

ప్రజాశక్తి-గాలివీడు

దాయాదుల మధ్య పాత ఇంటి గోడ సమస్యపై ఇరు గ్రూపుల మధ్య ఘర్షణ చోటు చేసుకోవడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. నూలివీడు పంచాయతీ కొత్త బండి వారిపల్లి దళితవాడకు చెందిన వీరంబల్లి విశ్వనాథ, రమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వీరబల్లి అశోక్, నాగమణి, రెడ్డి అంజలి, రేణుక కలిసి రమణ, విశ్వనాథపై దాడి చేసి గాయప రిచారని నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

- ఏడుగురు నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-పీలేరు

మారుతి సుజుకి వాహనంతో సహా 13 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు పీలేరు అటవీ శాఖ డివిజనల్ సంచార దళ నిఘా విభాగం డిఎఫ్ఒ గురు ప్రభాకర్ తెలిపారు. పీలేరు అటవీ శాఖ డివిజనల్ సంచార దళ నిఘా విభాగం కార్యాలయానికి అందిన రహస్య సమాచారం మేరకు శుక్రవారం వేకువ జామున చిత్తూరు జిల్లా, కల్లూరు నాలుగు రోడ్ల కూడలిలో వాహనాల తనిఖీ నిర్వహించామన్నారు. ఈ తనఖీలో 13 ఎర్రచందనం దుంగలను ఆక్రమముగా తరలి స్తున్న మారుతి సుజుకి కారును స్వాధీనం చేసుకుని, తమిళనాడు రాష్ట్రం, కర్పవ కుచ్చి జిల్లా, కళువరాయ్ మలై ప్రదేశానికి చెందిన ఏరిమలై, సెంథిల్, అన్ బలగన్, రామన్, అన్నాదొరై, కుప్పస్వామి, మణి అనే నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన ఎర్రచందనం దుంగలు శేషాచలం ఆటవీ ప్రాంతం నుంచి తరలిస్తున్నట్లు తెలిపారు. పట్టుబడిన ఎర్రచందనం విలువ వాహనంతో సహా రూ.20 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ దాడిలో ఫారెస్ట్ రేంజ్ అధికారి చంద్రశేఖర్, ఫారెస్ట్ సెక్షన్ అధికారి కె.ప్రకాష్ కుమార్, ఫారెస్ట్ బీట్ అధికారులు కె. ప్రతాప్, పి రెడ్డి ప్రసాద్, నందీశ్వరయ్య, ప్రొటెక్షన్ దాచర్లు పాల్గొన్నారు.



పట్టుబడిన నిందితులు, ఎర్రచందనం దుంగలతో అటవీశాఖ సిబ్బంది